# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 312 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 22, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## నేడు శంషాబాద్‌లో విద్యుత్తు లేని ప్రాంతాలు

ఈశంషాబాద్, మే 21(నమస్తే ఉదయం): గొల్లపల్లి విద్యుత్తు ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శంషాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ భాషా తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ ,రషీద్ గూడ, బహదూర్ గూడ ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు, రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.





### ఎమ్మెల్సీ ఎన్నికల్లో
## రాకేశ్‌కు ఓటేయాలి

- నిరుద్యోగుల పాలిట శాపంగా కాంగ్రెస్ విధానాలు
- ఉద్యోగాలు లేవు..నిరుద్యోగ భృతి కానరాదు
- ప్రచార సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

నల్లగొండ,మే21(నమస్తే ఉదయం): నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మిగతా.. 2లో



## కొత్త బ్రాండ్లు తీసుకొచ్చే ఆలోచన లేదు

- ఎన్నికల కోడ్ ముగిసాక ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన
- బిఆర్ఎస్ పనీపాటలేని ఆరోపణలు చేస్తోంది
- మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శలు

హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు తీసుకొస్తున్నామనేది దుష్ప్రచారమే నని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొత్త బ్రాండ్ల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదని, అసలు పరిశీలనే జరగలేదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దొంగే దొంగ అన్నట్లుగా భారాస నేతల మాటలు ఉన్నాయి. వారు ప్రతిదీ ఆరోపణలు చేసి బద్‌నామ్ చేసే దిశగా రాఝకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చాలా శాఖల్లో బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి రూ. 6వేల కోట్లకు పైగా చెల్లింపులు మా ప్రభుత్వంలో మిగతా.. 2లో





# ప్రపంచంతోనే పోటీ

- ఆ దిశగా తెలంగాణ పారిశ్రామిక విధానం ఉండాలి
- పరిశ్రమలకు అత్యుత్తమ గమ్యస్థానం కావాలి.. విదేశాల్లో అధ్యయనం చేసి రూపొందించండి
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం ఆదేశం.. 6 విధానాలు రూపొందిస్తున్నామన్న అధికారులు
- టెక్స్‌టైల్ పాలసీనీ సిద్ధం చేయాలన్న రేవంత్.. కోడ్ ముగిసిన వెంటనే ఏడు కొత్త పాలసీలు

హైదరాబాద్, మే 21, (నమస్తే ఉదయం): పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచంలోనే తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానం కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రాన్నే ఎంపిక చేసుకోవాలని, పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. ఆ దిశగా నూతన పారిశ్రామిక విధానం ఉండాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎసఐఐసీ)పై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై సీఎం పలు సూచనలు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను రూపొందించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లో అమల్లో ఉన్న అత్యుత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు. కాగా, కొత్తగా ఆరు విధానాలు సిద్ధం చేస్తున్నామని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎసఎంఈ పాలసీ, రాష్ట్రంలోని ఉత్పత్తులకు ఎగుమతులు పెంచి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ సాధించేందుకు ఎక్స్‌పోర్ట్ పాలసీ, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఫార్మా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు న్యూ లైఫ్‌సైన్సెస్ పాలసీ, ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ఈవీ పాలసీ, సహజ విద్యుత్తు ఉత్పత్తి పెంచేందుకు గ్రీన్ ఎనర్జీ పాలసీ, వైద్య పర్యాటకాన్ని పెంచేందుకు మెడికల్ టూరిజం పాలసీలను రూపొందిస్తున్నామని వివరించారు. కాగా, రాష్ట్రంలో చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొత్త టెక్స్‌టైల్ పాలసీ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

చేనేత రంగంపై ఆధారపడ్డ కుటుంబాలు రాష్ట్రంలోపెద్దసంఖ్యలో ఉన్నప్పటికీ.. వారికి సరైన ప్రోత్సాహం, సహకారం లేదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చేనేత కార్మికుల ఆదాయం పెంచడం, వారికి నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించడం, ఈ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం వంటి అంశాలతో కొత్త పాలసీ ఉండాలని మిగతా.. 2లో



### ఇండియా కూటమికి
## బుద్ధి చెప్పిన ప్రజలు

- ఐదు దశల్లోనే వారి ఓటమి ఖాయం అయ్యింది
- జూన్ 4న ఫలితాలతో మరింత స్పష్టం
- బీహార్ ప్రచారంలో ప్రధాని మోడీ

పాట్నా,మే21(నమస్తే ఉదయం): అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, టుక్డే టుక్డే గ్యాంగ్‌పై జూన్ 4న కీలక నిర్ణయం రాబోతోందని ప్రధాని మోడీ అన్నారు. ఇంతవరకూ జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో 'ఇండి' కూటమి పూర్తిగా ఓటమిపాలైందన్నారు. ఇండియా కూటమి పాపాలతో 21వ శతాబ్దపు భారతదేశం పురోగమించ లేదని, ఆ కారణంగానే ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలకు గట్టి గుణపాఠం చెబుతున్నారని అన్నారు.విపక్ష పార్టీల సారథ్యంలోని 'ఇండియా' కూటమిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని 'ఇండి' కూటమి పాపాలు ముందుకు తీసుకువెళ్లలేవని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఆరో విడత ప్రచారంలో భాగంగా బీహార్ లోని ఈస్ట్ చంపరాన్‌లో మంగళవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలు దేశాన్ని 60 ఏళ్ల పాటు ధ్వంసం చేశాయని, మూడు, నాలుగు తరాల జీవితాలను నాశనం చేశాయని మోదీ విమర్శించారు. 60 ఏళ్లలో ఈ వ్యక్తులు భారీ ప్యాలెస్‌లు మిగతా.. 2లో




### పండని సన్న వడ్లకు
## బోనస్ మోసం కాదా?

- రైతుల నోట్లో మట్టికొట్టారు
- వడ్ల కొనుగోలులో ప్రభుత్వం విఫలం
- విత్తనాలు అందక రైతులు క్యూలు కడుతున్నారు
- అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి
- జూన్ లోపు రూ.10 వేలు రైతు భరోసా ఇవ్వాలి
- నష్టపోయిన పంటలకు రూ.25 వేలు చెల్లించాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): వడ్లకు బోనస్ విషయంపై తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని చెప్పడం ఆ పార్టీ మోసానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. తెలంగాణలో యాసంగిలో పండేదే దొడ్డు వడ్లు... పండని సన్న మిగతా.. 2లో

### టాలీవుడ్‌లో రేవ్ పార్టీ
## కలకలం

- తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు ఆధారాలు
- బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ వెల్లడి
- డ్రగ్స్ నిర్మూలనలో కఠినంగా వ్యవహరిస్తామన్న మంత్రి
- బెంగళూరు రేవ్ పార్టీతో హైదరాబాద్ పోలీసుల అప్రమత్తం
- ఫామ్‌హౌజ్ ఓనర్లకు హెచ్చరికలు జారీచేసిన పోలీసులు

బెంగళూరు/హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): రేవ్ పార్టీ టాలీవుడ్‌లో కలకలం సృష్టిస్తోంది. నగర శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ స్పష్టం చేశారు. ఆమె సోమవారం విడుదల చేసిన వీడియో ఎక్కడి నుంచి తీశారో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి పెద్ద మొత్తంలో ఫీజు వసూలు చేశారని.. దాదాపు వంద మంది పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ప్రజా ప్రతినిధులెవరూ పాల్గొనలేదని కమిషనర్ వెల్లడించారు. 'సన్ సెట్ టు సన్ రైస్ విక్టరీ' పేరుతో





నిర్వహించిన ఈ పార్టీలో పాల్గొన్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. 'రేవ్‌పార్టీలో కోట్ల రూపాయల విలువైన కొకైన్, గంజాయి స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రాన్ని డ్రగ్స్‌ఫ్రీగా మార్చాలని చేసే ప్రయత్నాలు ఇతర రాష్ట్రాల డ్రగ్స్ పెడ్లర్ల వల్ల విఫలమవుతున్నాయి. ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తాం' అని తెలిపారు. బెంగుళూరు శివారులో ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మిగతా.. 2లో

### చివరి గింజ వరకు
## కొంటూనే ఉంటాం...

- ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం
- వరివేస్తే ఉరి అన్నవారా.. విమర్శించేది
- తడిసిన, మొలకెత్తిన ధాన్యం కూడా సేకరిస్తాం
- సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెట్టాం
- అబద్ధాలతో రైతులను ఆందోళనకు గురిచేస్తే ఊరుకోం
- బిఆర్ఎస్, బిజెపిల తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే కావాలని



దుష్ప్రచారాలు చేయడం, అబద్దాలు చెప్పడం అలవాటుగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు వడ్లు కొంటామని ఈ సందర్భంగా భట్టి వెల్లడించారు. మిగతా.. 2లో

## తెలంగాణలో యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ విసిలు

- పది యూనివర్సిటీల బాధ్యతలను ఐఎఎస్‌లకు అప్పగింత
- ఉస్మానియాకు దాన కిశోర్.. జెఎన్టీయూకు బుర్రా వెంకటేశం
- తెలుగు వర్సిటీ విసిగా శైలజారామయ్యర్‌ల నియామకం


హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): తెలంగాణలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పదవీ కాలం ముగియడంతో ఇన్‌ఛార్జ్ విసిలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇంఛార్జ్ వీసీలను నియమించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులకు మిగతా.. 2లో




### ఏసీపీ ఉమామహేశ్వరరావు
## ఇంటిపై ఎసిబి దాడులు

- అవినీతి అక్రమాలతో భారీగా ఆస్తుల సేకరణ
- 50 లక్షల వరకు నగదు.. పలు కీలక పత్రాలు స్వాధీనం
- ఏకకాలంలో పలుచోట్ల ఎసిబి సోదాలు

హైదరాబాద్,మే21(నమస్తే ఉదయం): నగరంలోని పలుచోట్ల ఏసీబీ అధికారులు మంగళ వారం సోదాలు నిర్వహించారు. సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనకు సంబంధించిన పది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. అత్యంత సంచలనం కలిగించిన సాహితీ ఇన్‌ఫ్రా కేసును ఉమామహేశ్వరరావు దర్యాప్తు



చేస్తున్నారు. ఈ కేసులో ప్రత్యేక చీఫ్ అధికారిగా ఆయన ఉన్నారు. పెద్ద ఎత్తున సాహితీ సంస్థ మోసాలకు పాల్పడిన విషయం తెలిసిందే. సీసీఎస్ ఏసీపీ ఉమా మహేశ్వరరావు మిగతా.. 2లో

## ఇండియా కూటమికి బుద్ధి చెప్పిన ప్రజలు

**మొదటిపేజీ తరువాయి..**

నిర్మించుకున్నారు. స్విస్ అకౌంట్లు తెరిచారు. మా పిల్లలకు చదువుకునేందుకు స్కూళ్లు లేవు. వారి పిల్లలు మాత్రం విదేశాల్లో చదువులు కొనసాగించారు. పేదల కష్టాల పాలయ్యారని అన్నారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై ప్రధానమంత్రి మోదీ పరోక్ష విమర్శలు చేస్తూ, జూన్ 4 తర్వాత మోదీ బెడ్ రెస్ట్ తీసుకుంటారని ఇక్కడ ఒకరు అన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే దేశంలోని ఏ ఒక్కరూ తమ జీవితంలో బెడ్ రెస్ట్ తీసుకోకూడదని తాను భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. దేశ ప్రజలంతా పూర్తి శక్తిసామర్థ్యాలతో ఉండాలని కోరుకుంటు న్నానని అన్నారు. జంగిల్ రాజ్ వారసుల నుంచి ఇంతకంటే ఏమి ఆశిస్తాం. మోదీని ఆడిపోసుకోవడం మినహా ఈ ఎన్నికల్లో వాళ్లు మాట్లాడేందుకు ఎలాంటి అంశాలు లేవని మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడత పోలింగ్ జూన్ 25న జరుగనుంది.

## కొత్త బ్రాండ్లు తీసుకొచ్చే ఆలోచన లేదు

మొదటిపేజీ తరువాయి..

జరిగాయి. ఈ నెలలోనే రూ.370 కోట్ల చెల్లింపులు చేశాం. మద్యం కొరత ఉంటే ప్రభుత్వానికే నష్టం.. ప్రజలకు కాదు. బ్లాకులో అమ్మిన ఘటనలపై ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేసింది. టానిక్‌లకు గత ప్రభుత్వం ఇచ్చిన పన్ను మినహాయింపులను రద్దు చేశాం. తయారీ యూనిట్ల వద్ద ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులు నిరంతరం పరిశీలిస్తున్నారు. గతంలో పైరవీలు, ముడుపులు ఉంటే తప్ప ఉద్యోగుల బదిలీలు జరిగేవి కావు. ఇప్పుడు అలాంటివేవీ లేకుండానే పోర్టల్ ద్వారా బదిలీలు జరుగుతున్నాయి. తప్పుడు రాతలు రాసిన పత్రికపై పరువునష్టం దావా వేస్తాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎక్సైజ్‌శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం అని జూపల్లి తెలిపారు.

## తెలంగాణలో యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ విసిలు

**మొదటిపేజీ తరువాయి..**

ఇంఛార్జ్ వీసీలుగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా దాన కిషోర్ నియమితులయ్యారు. జేఎన్టీయూ ఇంఛార్జ్ వీసీగా బుర్రా వెంకటేశం, కాకతీయ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా కరుణ వాకాటి,తెలంగాణ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సందీప్ సుల్తానియా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా రిజ్వి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా శైలజ రామయ్యర్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నవీన్ మిట్టల్, శాతవాహన యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా సురేంద్రమోహన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ జయేష్ రంజన్, పాలమూరు యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీగా నదీం అహ్మద్‌లను ప్రభుత్వం నియమించింది.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌కు ఓటేయాలి

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించిన ఖమ్మం- వరంగల్ -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు. మరి అరచేతిలో వైకుంఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్‌ఎస్‌కు ఓటేద్దామా..? ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా..? మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా..? అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. జాబ్ క్యాలెండర్ లేదు. మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ అంటున్నాడు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. ఉద్యోగాలు ఇచ్చామని డైలాగులు కొడితే నమ్మేందుకు మనం పిచ్చోళ్లామా..? కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు. మా తరఫున కొట్లాడాలి అంటే మాకు బలమివ్వాలి. కానీ బాకాలు ఊదేవాళ్లకు కాదు అని కేటీఆర్ చెప్పారు.

ప్రభుత్వం ఐదు నెలల్లో అన్ని వర్గాలను మోసం చేసింది. ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. బ్రహ్మాండంగా ఉన్న పరిస్థితిని చెడగొట్టుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పుడైనా ఆలోచించి ఓటేయండి.. ఆగం కాకండి. ఎవరి వల్ల లాభం జరుగుతదో ఆలోచించాలి. బ్లాక్ మెయిలర్లు, దందాలు చేసేటోళ్లకు అవకాశం ఇస్తే సమాజానికి తీవ్ర నష్టం. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే గ్రాడ్యుయేట్లు సరైన తీర్పునివ్వాలి. ఈ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డికి ఆశీర్వాదం ఇస్తే ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంటుంది అని కేటీఆర్ అన్నారు.

## టాలీవుడ్‌లో రేవ్ పార్టీ కలకలం

**మొదటిపేజీ తరువాయి..**

మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ పార్టీలో తాను లేనని తెలుపుతూ హేమ ఓ వీడియో విడుదల చేశారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని.. తనపై వస్తోన్న వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. అయితే రేవ్ పార్టీలో పోలీసులు సంపాదించిన ఫోటోలోని డ్రెస్, వీడియోలని డ్రెస్ ఒకటే కావడంతో అనుమానాలు బలపడ్డాయి. ఇదిలావుంటే బెంగళూరు శివారులో రేవ్ పార్టీ ఉదంతం హైదరాబాద్‌లో ప్రకంపనలు రేపుతోంది. నగర శివార్లలోని ఫాంహౌస్‌లలో తరచూ డ్రగ్స్ పట్టుబడడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. రేవ్ పార్టీలు, అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా నిఘా ఉంచారు. ఫాంహౌస్‌ల యజమానులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో సినీ పరిశ్రమ సహా వివిధ రంగాల ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి. ఈ పార్టీ వెనుక లింకుల్ని ఛేదించగా గోవా జైలులో ఉండే డ్రగ్స్ స్మగ్లర్ల పేర్లు బయటకొచ్చాయి. అంతకు ముందు టీఎస్ న్యాబ్ ఆధ్వర్యంలో రాజకీయ, సినీ ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. వరుస పరిణామాల దృష్ట్యా రేవ్ పార్టీని హైదరాబాద్‌లో కాకుండా బెంగళూరులో నిర్వహించినట్లు నగర పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ పార్టీ నిర్వహించిన వాసు నేపథ్యం, అతడి సంబంధాలపై దృష్టి సారించారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి..

### పేదల పాలిటి పెన్నిధి రాజీవ్ గాంధీ..

### ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

### సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ (డేవిడ్)

**రాజేంద్రనగర్,మే21 (నమస్తే ఉదయం):**

బడుగు బలహీన వర్గాల నాయకుడు,నవ భారత నిర్మాణ సృష్టికర్త దేశానికి దిశా నిర్దేశం చూపిన మార్గదర్శకుడు రాజీవ్‌గాంధీ అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ (డేవిడ్)అన్నారు. పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకల సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్ టీచర్స్ కాలనీ చౌరస్తాలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కోరని దయానంద్ (డేవిడ్) హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరని దయానంద్ మాట్లాడుతూ...దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. రాజీవ్‌గాంధీ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్లను దేశానికి పరిచయం చేశారని, రక్షణ రంగంలో అత్యాధునిక ఆయుదాలను సమకూర్చి దేశపూరోభివృద్ధికి దోహదపడ్డారన్నారు.



రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించారని కోరిని దయానంద్ కొనియాడారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వెనకబడిన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజల గుండెల్లో నిత్యం సంజీవుడేనని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు కోరని ఉదయ్ కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంతోనే పోటీ

**మొదటిపేజీ తరువాయి..**

సూచించారు. ఇక్కడి చేనేత ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఉండాలన్నారు. రాష్ట్రంలో వేలాది కుటుంబాలు తరతరాలుగా ఈ రంగాన్నే నమ్ముకుని జీవిస్తున్నాయని, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే చేనేత రంగం అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు టెక్స్‌టైల్ పాలసీని సైతం సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు పూర్తిస్థాయి పారిశ్రామిక విధానాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయని, పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించేలా కొత్త విధానాలు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఏడు కొత్త పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం ప్రకటించనుంది.

### తిరుమలలో సీఎం..

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. సీఎం అయ్యాక మొదటిసారిగా రేవంత్ కుటుంబసమేతంగా తిరుమలకు వచ్చారు. తిరుమలలోని రచన అతిథిగృహానికి మంగళవారం రాత్రి 7.20 గంటలకు చేరుకున్న రేవంత్‌రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బస చేయనున్న ఆయన మనవడి పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకుని బుధవారం ఉదయం 8.15 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. తిరిగి అతిథిగృహానికి చేరుకుని కొంతసమయం విశ్రాంతి అనంతరం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమవుతారు.

### సీఎంను కలిసి సూచనలు తీసుకున్న అందెశ్రీ, కీరవాణి

అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' గేయానికి ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి స్వరకల్పన చేయనున్నారు. ఈ పాటను రాష్ట్ర గేయంగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పాటను ప్రభుత్వ కార్యక్రమాల్లో, ఇతరచోట్లా వాడుకునేలా తీర్చిదిద్దుతున్నారు. దీనికి అందెశ్రీ కోరిక మేరకు కీరవాణి స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో కీరవాణి, అందెశ్రీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ భేటీ అయ్యారు. పాట నిడివి, ఇతర అంశాలపై సీఎం సూచనలు తీసుకున్నారు.

### రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ మంత్రి జానారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. నేతలంతా మంగళవారం సోమాజిగూడ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి.. అంజలి ఘటించారు. ప్రధానిగా దేశానికి రాజీవ్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. గాంధీభవన్‌లో రాజీవ్ చిత్రపటానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళులర్పించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్.. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ చేపట్టిన కార్యాచరణ వల్లనే దేశం సాంకేతికరంగంలో విప్లవాత్మక మార్పులను సాధించిందన్నారు.

## నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, మే 21(నమస్తే ఉదయం):**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్,కాటేదాన్, గగన్ పహాడ్, హిమాయత్ సాగర్ ప్రాంతాలలో బుధవారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్, హాథిరాం, ప్రవీణ్, శ్రీనివాస్ లు తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11:00 నుండి 12:30 వరకు కింగ్స్ కాలనీ ఫేస్ -1 ఫేస్ -2, ఫేస్ -3, ఫేస్ 4 లలో న్యూరు కాలనీ రిజ్వాన్ కాలనీ రొమాన్స్ హోటల్ ఎక్సెల్ స్కూల్ , మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగున్నర గంటల వరకు శాస్త్రి పురం రిజ్వాన్ కాలనీ ఓవైసీహెచ్ డైమండ్ హిల్స్ మాముకి హోటల్ నాసర్

### గగన్ పహాడ్‌లో...

గగన్ పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాప్యం బండ, ఆర్ జి కే , మంజీరా కండక్టర్, వివిఆర్ వెంచర్ గుంతాలలో ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు త్రిషాల విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి ఒకటిన్నర గంటల వరకు త్రిశల లేఔట్ లో, తమిళనాడు హోటల్ డైమండ్ వే బ్రిడ్జ్, బుద్వేల్ రైల్వే స్టేషన్ ,పరివార దాబా, ఆర్ఈసి, ఆరంఘర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2:30 నుండి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు.

**రాజేంద్రనగర్‌లో :** నారం విద్యుత్ లీడర్ పరిధిలో ఉదయం పదిన్నర నుండి 11:30 వరకు నారా మేనేజ్ డిసిపి ఆఫీస్ పరిసర ప్రాంతాలలో, రాజేంద్రనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి ఒకటిన్నర గంట వరకు రాజేంద్రనగర్ మాణిక్యమ కాలనీ అంబేద్కర్ నగర్ హనుమాన్ నగర్, గాంధీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు గాంధీ నగర్ ఓ ఆర్ ఆర్ కొత్తవాళ్ళ కూడా మజీద్ పరిసర ప్రాంతాలు లో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం తెలిపారు.

# చివరి గింజ వరకు కొంటూనే ఉంటాం...

**మొదటిపేజీ తరువాయి..**

గత బిఆర్‌ఎస్ సర్కార్ రైతులను పట్టించుకోలేదని, ప్రచారార్భాటాలు మాత్రం దండిగా చేసిందని విమర్శించారు. వరివేస్తే ఉరి అన్నవారా విమర్శలు చేసేదని మండిపడ్డారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెడతామని చెప్పారు. రైతుల పేరు మీద రాజకీయాలు చేయొద్దని ఆ రెండు పార్టీల నేతలకు ఆయన సూచించారు. స్వార్థ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని ఆగ్రహించారు. గత సర్కార్ తడిసిన వడ్లను కొనలేదని విమర్శించారు. తాము తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ రేటుకే కొంటున్నామని తెలిపారు. 15 రోజుల ముందు నుంచి వడ్లు కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం బీఆర్ఎస్ బీజేపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడొద్దని సూచించారు. గత బిఆర్‌ఎస్ మోసం చేసిన మాదిరిగా కాకుండా...వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే రాజకీయాలు చేయడం అలవాటు కనుక ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడం భారాస నేతలకు అలవాటన్నారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొంటున్నట్లు వివరించారు. గతం కంటే ఎక్కువగా 7,215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కొనలేదని గుర్తు చేశారు. 'చివరి గింజ వరకూ కొంటాం.. రైతులు ఆందోళన చెందవద్దని భట్టి భరోసా ఇచ్చారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా ఎంఎస్‌పీ ఇచ్చి తీసుకుంటాం. ధాన్యం రైతులకు మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నాం. వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలి. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.500 బోనస్ అనేది సన్న ధాన్యం నుంచి మొదలుపెట్టాం' అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో వరి కొనుగోళ్ల విషయంలో రైతులు) ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం తడిసినా, చివరకు మొలకెత్తిన గింజలు కూడా కొంటామని వెల్లడించారు. రేటు తగ్గించకుండా కొంటామని అన్నారు. దీంతోపాటు వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదు, కల్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దవుతుందని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అందులో నిజం లేదని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారని భట్టి గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం కంటే 15 రోజులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ మాదిరిగా కాకుండా మీకంటే ఎక్కువ కేంద్రాల్లో 7,245 కొనుగోళ్లను ప్రారంభినట్లు స్పష్టం చేశారు. ఎన్ని టన్నుల ధాన్యం పండినా కూడా కొంటామని స్పష్టం చేశారు. ఇక ధాన్యం బోనస్ విషయానికి వస్తే సన్న బియ్యానికే రూ. 500 బోనస్ అనలేదని, సన్నాలతో 500 రూపాయల బోనస్ పక్రియను మొదలు పెట్టామని చెప్పారు. నాటి సీఎం కేసీఆర్ వరి వేస్తే ఉరే అని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాలు ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదని భట్టి అన్నారు. రైతుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరగడంతో ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తప్పుడు సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లవద్దని కోరారు.

# ఏసీపీ ఉమామహేశ్వరరావు ఇంటిపై ఏసిబి దాడులు

మొదటిపేజీ తరువాయి..

ఇంట్లో ఎనిమిది గంటలుగా ఏసీబీ సోదాలు కొనసాగాయి. గతంలో ఇబ్రహీంపట్నం ఏసీపీగా ఉన్న సమయంలో ఉమా మహేశ్వరరావుపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. భూ వివాదాల్లో తలదూర్చి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. సాహితీ ఇన్ ఫ్రా కేసులో నిందితులనుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. నిందితులకు సపోర్ట్ చేసి బాధితులకు అన్యాయం చేస్తున్నాడని పలు ఫిర్యాదులు అందాయి. సోదాల్లో భాగంగా ఇప్పటికే పెద్ద మొత్తంలో నగదు, బంగారాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమా మహేశ్వరరావు బ్యాంకు లాకర్లను అధికారులు గుర్తించారు. గతంలో బీజేపీ నేత చరణ్ చౌదరిని బెదిరించి , టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్ రావు సహాయంతో రూ.30 లక్షలు నగదుని చరణ్ స్నేహితులు ద్వారా ఏసీపీ ఉమామహేశ్వరరావు నగదు బదిలీ చేయించుకున్నారు. ఏక కాలంలో ఎనిమిది చోట్ల..ఏపీ , తెలంగాణాలో ఏసీబీ సోదాలు కొనసాగాయి. సోదాల అనంతరం ఏసీబీ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

ఆదాయానికి మించి పెద్ద ఎత్తున ఆస్తులను కూడబెట్టారని ఏసీబీకి ఉమామహేశ్వరరావుపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో నిఘా ఉంచిన ఏసీపీ అధికారులు ప్రస్తుతం సోదాలు కొనసాగించారు. ఈ సోదాలు కలకలం రేపుతున్నాయి. సీసీఎస్ ఏసీపీ ఉమా మహేశ్వరరావు, ఆయన కూతురు ఇంట్లో ఏసీబీ నిర్వహిస్తున్న సోదాల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. ఉమామహేశ్వరరావు ఇంట్లో సోదాలు నిర్వహిస్తుండగా.. ఎస్పీ గోనె సందీప్ రావుకు చెందిన డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. ఈ డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. సందీప్ రావు డీసీపీగా పని చేస్తున్నారు. ఆయన ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రీ లాంచ్ పేరుతో వందల కోట్లు మోసం చేసిన సాహితి ఇన్ ఫ్రా రియల్ ఎస్టేట్ మోసం కేసును ఏసీపీ ఉమామహేశ్వరరావు విచారణ చేస్తున్నాయి. ఫ్రీలాచింగ్ ఆఫర్లతో బాధితుల నుంచి భారీగా సొమ్ములను వసూలు చేసింది. సుమారుగా రూ.1800 కోట్ల వరకు ఈ సంస్థ మోసాలకు పాల్పడిందని సీసీఎస్ అధికారులు నిగ్గు తేల్చారు. సాహితీ సంస్థ కేసులోనూ ఉమామహేశ్వరరావు అవకతవకలకు పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. అయితే కేసులో పెద్దగా పురోగ లేకపోవడంతో ఉమామహేశ్వరరావుపై అనేక ఆరోపణలు ఉండటంతో ఏసీబీ అధికారులు రెయిడ్ చేశారు. అశోక్‌నగర్‌లోని ఆయన ఇల్లు, ఆఫీసు కేబిన్ సహా 10 చోట్ల తనిఖీలు చేపట్టారు. విశాఖలోని ఆయన బంధువుల ఇళ్లలోనూ ఈ దాడులు చేశారు. ఏసీపీ సన్నిహితులు, బంధువులు ఇళ్లలోనూ దాడులు చేస్తోంది. గతంలో ఆయన ఇబ్రహీంపట్నం ఏసీపీగా పనిచేశారు. డబుల్ మర్డర్ నిందితుడు మట్టారెడ్డి నుంచి ముడుపులు తీసుకున్నాడని ఉమామహేశ్వరరావుపై అభియోగాలు ఉన్నాయి. ఉమామహేశ్వర రావు ఇంట్లో ఇంకా ఏమేమి దొరికాయన్న దానిపై ఏసీబీ అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ఆయన దర్యాప్తు చేసిన కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. ఉద్దేశపూర్వకంగా నిందితుల్ని వదిలి పెట్టడం వంటివి చేశారన్న ఆరోపణలు బలంగా ఉండటంతో వాటన్నింటినీ వెలికి తీసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆయనతో పాటు ఆయన బంధువుల ఇళ్లల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున నగదు దొరికిందని ప్రచారం జరుగుతోంది. కనీసం రూ. యాభై లక్షల రూపాయల నగదు తో పాటు పెద్ద ఎత్తున ఆస్తుల డాక్యుమెంట్లు కూడా సీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. సందీప్ రావు విషయంలోనూ ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంది. ఆయన ఆస్తి పత్రాలు ఉమామహేశ్వరరావు దగ్గర ఎందుకు ఉన్నాయో విచారణ జరిపే అవకాశం ఉంది. సందీప్ రావుపైన కూడా డిపార్టుమెంట్‌లో అనేక ఆరోపణలు ఉండటంతో ఆయన పైనా దాడులు నిర్వహించి.. సోదాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏసీబీ యాక్టివ్ గా పని చేస్తోంది. హెచ్ఎండీఏ అధికారిగా పని చేసిన బాలకృష్ణను పట్టుకోవడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రియల్ ఎస్టేట్ మాఫియా గురించి అనేక వివరాలు బయటకు వచ్చాయి. ఇప్పుడు ఏసీపీని అరెస్టు చేయడం.. ఆయన కూడా రియల్ ఎస్టేట్ మోసానికి చెందిన కేసును విచారణ జరుపుతూండటంతో... కీలక విషయాలు వెలుగులోకి వస్తాయన్న ప్రచారం జరుగుతోంది.

# పండని సన్న వడ్లకు బోనస్ మోసం కాదా?

**మొదటిపేజీ తరువాయి..**

వడ్లకు బోనస్ ఇస్తామనడం మోసం కాదా, రైతులు నోట్లలో మట్టికొట్టడం కాదా? అని ప్రశ్నించారు. వానకాలంలో 20 శాతం సన్నాలు, యాసంగిలో 99 శాతం దొడ్డువడ్లు పండుతాయి. నిరుద్యోగులకు 4 వేల భృతి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తర్వాత ఆ హామీ ఇవ్వలేదని అసెంబ్లీలో చెప్పారు. వడ్ల విషయం లోనూ మాట తప్పుతున్నారని మండిపడ్డారు. కోటి 20 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యానికి 500 బోస్ ఇవ్వాలంటే 6 వేల కోట్లు కావాలి. సన్నాలకు మాత్రమే ఇస్తే 500 కోట్లు సరిపోతాయి. 4500 కోట్లు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. సన్నవడ్లకే మాత్రమే బోనస్ ఇస్తారా? దొడ్డు వడ్లకు ఇవ్వరా? దొడ్డు వడ్లకు ఇస్తే ఎప్పటి నుంచి కొంటారో చెప్పాలని నిలదీశారు. భట్టి మాటలు వట్టి మాటలు. సన్నవడ్లకే బోనస్ ఇస్తామని చెప్పిన మాటను ఓట్లు డబ్బాలో పడకముందు ఎందుకు చెప్పలేదు? డబ్బాలో ఓట్లు పడి సీల్ అయిన తెల్లారి చెప్పి దగా చేశారని మండిపడ్డారు.

### వడ్ల కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం

వడ్ల కొనుగోలులో 4, 5 కిలోలు తరుగు పెడుతున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వాళ్లను అనరాని మాటలు అంటున్నారు. తడిచిన వడ్లు సహా అన్ని రకాల వడ్లు కొంటామని ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. ధాన్యం కొనడం లేదని రైతులు నాకు ఫోన్ చేస్తున్నారు. మెదక్ ముత్తెకోట నుంచి బెజ్జంకి కేంద్రానికి లోడ్‌తో వెళ్లిన లారీ డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డితో హరీష్ ఫోన్లో మాట్లాడారు. తడిచిన ధాన్యాన్ని మూడు రోజుల్కెనా కొనడం లేదని డ్రైవర్ సమాధానం ఇచ్చారు.

### జూన్ లోపు రైతు భరోసా ఇవ్వాలి

రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి పాక్షికంగానే ఇస్తున్నారు. గతంలో మాదిరే తొలి విడత కింద రూ.7500 కాకుండా రూ.5 వేలే ఇస్తున్నా రు. కాంగ్రెస్ హామీ ప్రకారం రైతు భరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని బీఆర్ ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. బకాయి పడిన రూ.2500, వానా కాలం పంటల విడత కింద రూ.7500 కలిపి జూన్ లోపు రూ.10 వేలు ఇవ్వాలి.

### ఇదేనా రైతులపై చిత్తశుద్ధి...

ఎన్నికల హామీ ప్రకారం జొన్న, మిరప, పసుపు, సోయాబీన్, ఎర్రజొన్న ఇతర పంటలకు కూడా మద్దతు ధర ఇవ్వాలి? వాటికి ఇస్తారా ఇవ్వరా? వానాకాలం నుంచి పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూసారం పెంచే జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను కూడా ప్రభుత్వం సరఫరా చేయలేకపోతోంది. రైతులు ఎరువుల కోసం పెట్టినట్లు విత్తనాల కోసం కవర్లు ల్కెన్లో పెడుతున్నారు. ఇదే రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. వడ్ల బోనస్‌పై కేబినెట్ నిర్ణయాన్ని ప్రభుత్వం సమీక్షించుకోవాలని సూచించారు.

అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి. ఏ పంటలకు బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారో ఆ పంటలకు వానకాలం నుంచి ఇవ్వాలి. రైతుబంధుకు కోతలు పెట్టకుండా తక్షణమే 7500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. వడగళ్ల వాన, అకాల వర్షాల్లో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలి. వానలు పడుతున్నాయి కాబట్టి తడిచిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనాలని డిమాండ్ చేశారు.

## దేశం కోసం ప్రాణాలర్పించిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ

**చార్మినార్, మే21(నమస్తే ఉదయం):**

రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన కమిటీ చైర్మన్ జీ నిరంజన్ రాజీవ్ గాంధీ 33 వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహెూన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని అన్నారు యువతకు 18 సంవత్సరాల ఓటు , కంప్యూటర్ వ్యవస్థను దేశంలో ఈరోజు ప్రజల చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ఆయన కృషి వల్లనే కంప్యూటర్ టెక్నాలజీ దేశంలోని అన్ని వర్గాల వారికి అందుబాటులో తెచ్చిన వ్యక్తి శ్రీ రాజీవ్ గాంధీ అని అన్నారు ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించినారు ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించినారు ఈ యొక్క కార్యక్రమంలో జి కన్నయ్యలాలతోపాటు అశోక్ రెడ్డి ఓం ప్రకాష్ శర్మ హాజీ మూసా వెంకటేష్ ముదిరాజ్



శ్యామ్ రావు ముదిరాజ్ ముజాహిద్ హుస్సేన్ ఎండి వదూత్ దినేష్ కుమార్ అశోక్ రెడ్డి ముజీవుల్లా షరీఫ్ దిలావర్ హుస్సేన్ టి చంద్రశేఖర్ ఎం కృష్ణ కుమార్ తదితరులు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి జి కన్నయ్య లాల్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు...

### పూలమాలలు వేసి నివాళులర్పించిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు...

**కూకట్‌పల్లి,మే 21 (నమస్తే ఉదయం):** భారత దేశ మాజీ ప్రధాని,భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజక వర్గం కూకట్ పల్లి డివిజన్ లోని ప్రగతి నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద, దీనబందు కాలనీ సర్కిల్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి కూకట్ పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్తి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా..

### పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు చంద్రారెడ్డి..

**కూకట్‌పల్లి, మే 21 (నమస్తే ఉదయం):**
పాపిరెడ్డి నగర్ బస్తి సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి చేస్తామని పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు . మంగళవారం పాపిరెడ్డి నగర్ లోని రోడ్ నెంబర్ 3 సి బ్లాక్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో



ప్రధాన కార్యదర్శి ఆర్.భగవంత రెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్ , కాంగ్రెస్ నాయకులు, బస్తి వాసులు జి.బి కన్నారావు, వనం ఆంజనేయులు, సజ్జన యాదగిరి, తాటి కిరణ్, ఎం కనకారెడ్డి, వెంకటేశ్వరరావు, సంపత్ రెడ్డి, శ్రీనివాస్ , కేశవరెడ్డి, రాము గౌడ్, దామోదర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## దేశంలో సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ...

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్

**కూకట్‌పల్లి, మే 21 (నమస్తే ఉదయం):**
భారతదేశ గొప్ప నేత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్, హాఫీజ్ పేట్ డివిజన్ కార్పొరేటర్ వి.పూజిత గౌడ్




నివాళులు అర్పించారు. మంగళవారం నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి అతిపిన్న వయసులో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన నాయకుడు రాజీవ్ గాంధీ, యువతకు రాజకీయాల్లో మార్గదర్శ కుడుగా నిలిచాడని కొనియాడారు. ఓటింగ్ వయస్సును తగ్గించడం, పంచాయతీరాజ్, టెలికాం, ఐటీ విప్లవం వంటి స్థిరమైన శాంతి ఒప్పందాలను బలోపేతం చేయడం, బహుళ జోక్యాల ద్వారా 21వ శతాబ్దంలో భారతదేశాన్ని మార్చారని, వారి అమర వీరునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విప్లవకారుడు రాజీవ్ గాంధీ

### - పిసిసి మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి

**రాజేంద్రనగర్, మే 21(నమస్తే ఉదయం):** దేశంలో టెక్నాలజీ ని తీసుకువచ్చి విప్లగాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప నాయకుడు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని పిసిసి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదా లక్ష్మీ అన్నారు. మంగళవారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉడం గడ్డ



లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదాలక్ష్మి మాట్లాడుతూ... స్వర్గీయ రాజీవ్ గాంధీ హాయంలో పల్లెలు అభివృద్ధి చెందాలని లక్ష్యంతో నేరుగా గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయటం, యువతకు 21 ఏళ్లకు ఓటు హక్కు కల్పించడం విక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. రాజీవ్ గాంధీ హాయంలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు వెల్లిన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్ళు సరోజ, సరిత, లలిత, జ్యోతి, మన్నెమ్మ, సుగుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన గొప్ప నాయకుడు స్వర్గీయ రాజీవ్ గాంధీ

### కొత్తకోటలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**కొత్తకోట, మే 21(నమస్తే ఉదయం):**
దివంగత నేత మాజీ ప్రధానమంత్రి భారతరత్న స్వర్గీయు రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతి కొత్తకోట మండల కేంద్రంలో, పట్టణ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు ,మేస్త్రీ శ్రీనివాస్,బీచుపల్లి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్ జె బోయోజ్ లు మాట్లాడుతూ ...దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి గ్రామాలకు అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి రూపు తీసుకువచ్చిన మహానుభావుడు దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలోకి నడిపిన రథసారథి రాజీవ్ గాంధీ 40 ఏళ్ల వయసులో భారతదేశానికి ఆరవ ప్రధానమంత్రి అయ్యారు.

భారత ప్రభుత్వం మరణానంతరం రాజీవ్ గాంధీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం ఆయన భారతరత్నాన్ని ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పీజే బాబు, మాజీ సర్పంచ్ ధన్వాడ బాలస్వామి, మున్సిపాలిటీ కౌన్సిలర్ రామ్మోహన్ రెడ్డి, మాజీ కోఆప్షన్ నెంబర్ ఎంఏ లతీఫ్, మున్సిపాలిటీ కో ఆప్షన్ నెంబర్ జె ఏం మీషేక్, మాజీ సర్పంచ్ భాలస్వామి,మాజి వార్డు మెంబర్లు సలీం ఖాన్, గంగు బాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జె సుభాష్, రాఘవేందర్ గౌడ్, సయ్యద్ లాల్, రెడ్డి జగన్, రాములు యాదవ్, హరీష్ రెడ్డి, సంద వెంకటేష్, సాయిల్ యాదవ్, కృష్ణ, గోకరయ్య నాయుడు, ఎండి సుల్తాన్, మహమ్మద్ ఎజాస్, బాలకొండయ్య యాదవ్, కురుమూర్తి నాయుడు, రాంలాల్ నాయక్, టైలర్ గఫార్,జె నవీన్,జె బాబన్న, ఇమ్రాన్ ఖాన్, లక్ష్మయ్య యాదవ్, సయ్యద్ సిరాజ్ ద్దీన్, అంజన్న యాదవ్, నవీన్ రెడ్డి, దిలీప్ రెడ్డి, జె కురుమయ్య, వెంకటయ్య నాయుడు, మహేష్, కైసర్, కొత్వాల్ చోటు తదితరులు పాల్గొన్నారు.




స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలి

### - ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్

**కూకట్‌పల్లి, మే 21 (,నమస్తే ఉదయం):**
ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్ననను పట్టభద్రుల ఎన్నికల్లో గెలిపించాలని రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ కోరారు. ఈ మేరకు ప్రతి ఒక్క కార్యకర్త తీన్మార్ మల్లన్న విజయానికి కృషిచేసి ఆయనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భముగా తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలను బయటికి తీసి రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో అభిమానులను సొంతం చేసుకున్న తీన్మార్ మల్లన్న గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని ముఖ్య నేలను ఆదేశించారు. అలాగే గత ప్రభుత్వం యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసిందని, నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తమని చెప్పి యావత్తు తెలంగాణ రాష్ట్ర యువతను మోసం చేసిన ఘనత కేసీఆర్ దే నన్నారు. కేంద్రంలో బీజేపీ కూడా గత పదేండ్ల



పాలనలో ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామ ని నమ్మించి మోసం చేసిందని, బీజేపీ , బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యం వలన యువత తన భవిష్యత్తు కోల్పోదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మెగా డీఎస్సీ ప్రకటించిందని, కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించిందని, ములుగు వైద్య కళాశాల యందు కూడా ఉద్యోగ భర్తీకి ప్రకటన కూడా విడుదల చేసిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఉద్యోగ ప్రకటనలు ఇచ్చి ఉద్యోగ భర్తీ చేసిన ప్రభుత్వం కూడా కాంగ్రెస్ పార్టీయే కానీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కావని, కాబట్టి చదువుకున్న పట్టభద్రులందరూ మరోసారి ఆలోచించుకుని తీన్మార్ మల్లన్న ను గెలిపించాలని కోరారు. తీన్మార్ మల్లన్న కూడా గత కొద్ది సంవత్సరాల నుండి బీఆర్ఎస్ప్రభుత్వ అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నిస్తే కావాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న మీద ఎన్నో అక్రమ కేసులు పెట్టిందని, అక్రమ అరెస్టులకు మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని నిలబడ్డ వ్యక్తి మల్లన్న కావున పట్టభద్రులందరూ కూడా మే 27 న హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## దేశాభివృద్ధి, దేశ సమైక్యత కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ : నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్



### సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలి...

### - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం..

**కూకట్‌పల్లి, మే 21 (నమస్తే ఉదయం):**
భారత రత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్ బి డివిజన్ రాజీవ్ సర్కిల్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే పిన్న వయస్కుడిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి సమర్ధవంతంగా సుస్థిరపాలన అందించిన రాజకీయ నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచారని, రాజకీయా లంటే ఇష్టం లేకపోయినా ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచి పోయే విధంగా శాస్త్ర సాంకేతిక రంగ వృద్ధికి ఊతమిచ్చారని అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దివంగత రాజీవగాంధీ దేశానికి చేసిన సేవలు ఎన్నడూ మరువలేనివని, విద్యార్థులకు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేసింది రాజీవ్ గాంధీయేనని, సాంకేతిక విప్లవం ద్వారా భారత దేశాన్ని, ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన రాజీవగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, గంధం రాజు, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగి రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, మేకల రమేష్, అరవింద్ రెడ్డి, ఫణి కుమార్, గిడుగు అప్పారావు, విట్టల్ రెడ్డి, రామారావు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రజిత, రేష్మ, స్వరూప, గోపాల్ చౌదరి, శేఖర్ గజానంద్, అశోక్, అరవింద, ప్రణతి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## ఘనంగా వ్యాపారవేత పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు...

**రాజేంద్రనగర్,మే 21(నమస్తే ఉదయం):**
వ్యాపారవేత పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటేదాన్ పరిశ్రామికవాడలోని జ్యోతి ట్రేడర్ కార్యాలయంలో తోటి వ్యాపారవేతలు, స్నేహి తులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పట్లోళ్ల శ్రీధర్ రెడ్డిని పులమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు .అనంతరం స్నేహితుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. స్వీట్లను పంపిణీ చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ఈ జన్మదిన వేడుకల్లో శీలం తిరుపతిరెడ్డి,ఔరాది రమేష్, సూరెడ్డి సాయి రెడ్డి,శీలం జగన్మోహన్ రెడ్డి,సూరెడ్డి కరుణాకర్ రెడ్డి,మాడపాటి కిషోర్ కుమార్,చిట్టే మురళి,ఎనుముల ధనంజయ రెడ్డి, మేక్కొండ ప్రేమ్ రాజ్,సూరెడ్డి సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## సురేష్ ప్రొడక్షన్స్ సెలబ్రేటింగ్
# 60 గ్లోరియస్ ఇయర్స్

పద్మ భూషణ్, మూవీ మొఘల్, లెజెండరీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు గారు స్థాపించిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ అరవై ఏళ్ల అద్భుత సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకొని వైభవోత్సవాలు జరుపుకుంటోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నిర్మాణ సంస్థగా ప్రేక్షకుల మన్ననలని పొందిన సురేష్ ప్రొడక్షన్స్ 60 సంవత్సరాల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో శతాధిక చిత్రాలను ప్రేక్షకులకందించి చరిత్ర సృష్టించింది. ఎన్నో అద్భుతమైన చిత్రాలని నిర్మించి ప్రేక్షకులని విశేషంగా అలరిస్తున్న సురేష్ ప్రొడక్షన్స్ అన్ని భారతీయ భాషల్లో సినిమాలు నిర్మించి సంస్థగా అరుదైన ఘనత



సాధించింది. 1964లో ప్రారంభమై, ఎన్నో కల్ట్ క్లాసిక్ హిట్స్, మోడరన్ మాస్టర్ పీస్ చిత్రాలతో గత ఆరు దశాబ్దాలుగా ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ పంచుతోంది. సురేష్ ప్రొడక్షన్స్ 60ఏళ్ళు పూర్తి చేసుకుని వైభవోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ అద్భుతమైన సినీ ప్రయాణంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, ప్రేక్షకులకు, అభిమానులకు, మీడియాకు, ప్రతి ఒక్కరికీ నిర్మాణ సంస్థ కృతజ్ఞతలు తెలియజేసింది. రామానాయుడు గారి వారసత్వాన్ని ఆయన కుటుంబ సభ్యులు దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.



## 'హరోం హర'
## జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా
# గ్రాండ్‌గా విడుదల

సుధీర్ బాబు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'హరోం హర' ప్రమోషన్స్ జోరందుకున్నాయి. ఆకట్టుకునే పాటలు, ఆసక్తిని రేకెత్తించే టీజర్, ప్రోమోలకు అద్భుతమైన స్పందనతో, సినిమాపై హ్యూజ్ హైప్ క్రియేట్ చేశాయి. సుధీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన మురుగన్ పాట, సునీల్‌తో అతని స్నేహాన్ని చూపించడం కూడా విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా మేకర్స్ కొత్త విడుదల తేదీని అనౌన్స్ చేశారు. ముందుగా మే 31న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా జూన్ 14కి షిఫ్ట్ చేశారు. చేతిలో తుపాకీతో ఉన్న సుధీర్ బాబు బ్రాండ్ న్యూ పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా ఈ వార్తను మేకర్స్ అధికారికంగా అనౌన్స్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జూన్ 14న నోటెడ్ సినిమా ఏదీ రానందున, హరోం హర సోలోగా విడుదల కానుంది. ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయికగా నటిస్తుండగా ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రం చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగిన పీరియాడికల్ ఫిల్మ్.



# అతిథుల్ని ఆకట్టుకున్న 'కన్నప్ప' టీజర్

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' తెర మీదకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ దాదాపుగా పూర్తి కావొస్తుంది. రీసెంట్‌గానే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ మీద కొన్ని సీన్లను చిత్రీకరించారు. ఆపై ప్రభాస్ మీద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. కేన్స్ ఫెస్టివల్‌లో కన్నప్ప టీం సందడి చేసింది. మోహన్ బాబు, విష్ణు మంచు, ప్రభుదేవా వంటి వారు కన్నప్ప కోసం కేన్స్ ఫెస్టివల్‌కు వెళ్లారు. ఇక అక్కడే కన్నప్ప టీజర్‌ను అందరికీ పరిచయం చేశారు. కన్నప్ప టీజర్‌కు అక్కడి వారంతా ముగ్దులయ్యారు.

ఇక కన్నప్ప టీజర్‌ను ఇండియన్ ప్రేక్షకులకు చూపించేందుకు ముహూర్తాన్ని ఫిక్స్ చేశారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా కన్నప్ప టీజర్ విడుదల కానుంది. కానీ అంతకు ముందే తెలుగు ప్రేక్షకులకు కన్నప్ప టీజర్‌ను చూపించబోతున్నారు. మే 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను ముందుగా రిలీజ్ చేస్తామని విష్ణు మంచు ప్రకటించారు. ఈ మేరకు విష్ణు మంచు ఓ ట్వీట్ వేశారు. 'కేన్స్‌లో మా కన్నప్ప టీజర్‌ను అందరికీ చూపించాం. టీజర్‌ను చూసి అందరూ ప్రశంసించారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్లు, అక్కడికి వచ్చిన ఇండియన్స్ కన్నప్ప టీజర్‌ను చూసి ముగ్దులయ్యారు. ఆ రెస్పాన్స్ చూసిన తరువాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. మన ఇండియన్ ప్రేక్షకులకు జూన్ 13న టీజర్ చూపించబోతున్నాం. మే 30న తెలుగు టీజర్ ను హైద్రాబాద్‌లోని పాపులర్ థియేటర్‌లో ప్రదర్శించనున్నాం. మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంత మంది సెలెక్టెడ్ ఆడియెన్స్‌కు ఆ టీజర్‌ను చూపిస్తాం. మా టీం వారిని సెలెక్ట్ చేస్తుంది.

# ఘనంగా 'డర్టీ ఫెలో' ప్రీ రిలీజ్

ఈ నెల 24న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న డర్టీ ఫెలో ఇండియన్ నేవీలో పనిచేసిన సోల్జర్ శాంతి చంద్ర హీరోగా నటిస్తున్న సినిమా 'డర్టీ ఫెలో'. ఈ చిత్రంలో దీపిక సింగ్, సిమ్రితీ బతీజా, నిక్కిషా రంగ్ వాలా హీరోయిన్స్ గా కనిపించబోతున్నారు. 'డర్టీ ఫెలో' చిత్రాన్ని గుడూరు భద్రకాళీ సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై జి శాంతి బాబు నిర్మిస్తున్నారు. ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 24న గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. తాజాగా చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, హీరో సంపూర్ణేష్ బాబు గెస్ట్ లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ - శాంతి చంద్ర నాకు ఒక బ్రదర్ లాంటి వ్యక్తి. ఆయన మంచి వాడు. సినిమాకు డర్టీ ఫెలో టైటిల్ ఎందుకు పెట్టారని అడిగాను. ఈ సినిమాకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేదని డైరెక్టర్ గారు చెప్పారు. సినిమా మీద ప్యాషన్ ఉన్న శాంతి చంద్ర అన్న హీరోగా ఈ మూవీ చేస్తుండటం సంతోషంగా ఉంది. డర్టీ ఫెలో సినిమా పాటలు, ట్రైలర్ చూశాను. మంచి కథతో వస్తున్న మూవీ ఇది. శాంతి చంద్ర అన్న తను కోరుకున్న అంశాలతో నచ్చిన విధంగా ఈ సినిమాను నిర్మించాడు. డాక్టర్ సతీష్ గారి మ్యూజిక్ సూపర్బ్ గా ఉంటుంది. డర్టీ ఫెలో సినిమా మంచి హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. దర్శకుడు ఆడారి మూర్తి సాయి మాట్లాడుతూ - డర్టీ ఫెలో సినిమాకు పనిచేసిన వాళ్లంతా ఒక కుటుంబంలా పనిచేశారు. మన ఇంట్లో వాళ్లను పొగడాల్సిన



అవసరం లేదు. నేను చేసే రిక్వెస్ట్ ఒకటే. ఒకప్పుడు మన సినిమాలకు శతదినోత్సవాలు జరుపుకునేవాళ్లం. ఇప్పుడు రెండు రోజులకే సినిమా లైఫ్ ఫినిష్ అవుతూ జత దినోత్సవాలు జరుపుకునే పరిస్థితి వచ్చింది. టీవీ వచ్చాక సినిమా పనైపోయింది అన్నారు. పైరసీ వచ్చాక ఇక సినిమా బతకలేదన్నారు. అయినా ఇండస్ట్రీ తట్టుకుని ముందడుగు వేస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు పైరసీ కాదు ప్రైవసీ జబ్బు వచ్చింది.



## జూన్ 7న థియేటర్లో
# ఓసి

కౌండిన్య ప్రొడక్షన్స్ పై బీవీస్ నిర్మాతగా, విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం ఓసి. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా సినిమాలోకి రావాలని కొంతమంది యువకుల కథే ఓసి. శరవేగంగా నిర్మాణాంతరపు పనులను పూర్తి చేసుకుంటున్న ఓసి.. జూన్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

ఇప్పటికే విడుదలైన ఓసి టీజర్ విశేష ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిత్ర పరిశ్రమలో స్టార్ల కొడుకులే హీరోలవుతారు అనే డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేసేలా చేస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని కుర్రాళ్ళు సినిమాలో రాణించారా లేదా అనేది తెలియాలంటే జూన్ 7 వరకు వేచి చూడాల్సిందే.

మంచి నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్ తో ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా ఓసి చిత్రాన్ని తెరకెక్కించినట్టు మేకర్స్ తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కథాకథను ఉంటుందని.. థియేటర్లో చూసే వీక్షకులను ఓసి కట్టిపడేస్తుందని చిత్ర యూనిట్ నమ్మకంగా ఉన్నారు. ఈ చిత్రానికి లక్ష్మీకిరణ్ కథ, సాయిరాం తుమ్మలపల్లి సినిమాటోగ్రఫీ అందించగా డాన్స్ మాస్టర్ సత్య కొరియోగ్రఫీ అందించగా, వంశీ ఎస్. అక్షర్ బ్యాండ్ సంగీతం సమకూరుస్తున్నారు.

ఇంతకీ ఓసి అంటే ఏంటో చూడాలంటే జూన్ 7 వరకు వేచి ఉండాల్సిందే.

# ఎవరిని తప్పిస్తున్నారు..?

### బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారంలో ఏం జరుగుతుంది..?

కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం శివారు ఎలక్ట్రానిక్ సిటీలోని ఫామ్‌హౌస్‌లో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఈ పార్టీలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నట్టు పోలీసులు వెల్లడించారు. మొత్తం 100 మందికిపైగా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 70 మంది యువకులు, 30 మంది యువతలు ఉన్నారని చెప్పారు. కానీ, ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందని సమాచారం. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి పుట్టినరోజు వేడుకల కోసం ఫామ్‌హౌస్‌ను బుక్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై కేసు నమోదుచేశారు.

ఈ రేవ్ పార్టీలో దొరికిన ప్రముఖుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో పోలీసులు చేర్చలేదని తెలుస్తోంది. 100 నుంచి 150 మంది గుర్తు తెలియని వ్యక్తులను పట్టుకున్నామని వారు పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ పార్టీలో తెలుగు, తమిళ, కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులతో పాటు వ్యాపార రాజకీయ ప్రముఖులు కూడా హాజరయ్యారు. పార్టీలో నిషేధిత డ్రగ్స్ 17 గ్రాముల ఎండీఎంఏతోపాటు గంజాయి, 20కి పైగా లగ్జరీ కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్టీకి హాజరైనవారి నుంచి రక్త నమూనాలను సేకరించి, పరీక్షలకు పంపారు. బెంగళూరు నగర క్రైమ్ విభాగం అదనపు కమిషనర్ చంద్రగుప్త మాట్లాడుతూ.. జీఆర్ ఫామ్ హౌస్‌లో ఆదివారం రాత్రి రేవ్ పార్టీ నిర్వహించారని, పార్టీలో డ్రగ్స్ వాడినట్టు ఆధారాలున్నాయని, 15 గ్రాముల ఎండీఎంఏ, కొకైన్, హైడ్రో గంజా ఆరు గ్రాముల చొప్పున స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన వాసు, అరుణ్ అనే వ్యక్తులు పుట్టినరోజు వేడుకల పేరుతో పార్టీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. 'సన్ సెట్-సన్ రైజ్ విక్టరీ' పేరుతో జరిగిన ఈ వేడుకల్లో వారి స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్టు చెప్పారు. పార్టీకి తెలుగు టీవీ ఆర్టిస్ట్‌లు, మోడల్స్ హాజరైనట్టు గుర్తించామని అన్నారు. వీరితో పాటు టెక్కీలు, 25 మంది యువతులు



హాజరయ్యారు. ఇప్పటి వరకూ ఈ కేసులో ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. వీరిలో సిద్ధిఖీ, రణధీర్, రాజులను డ్రగ్స్ పెడ్లర్లుగా గుర్తించారు. పోలీసుల దాడి సమయంలో కొందరు డ్రగ్స్‌ను టాయ్‌లెట్‌లు, బాత్‌రూమ్‌లు ఇతర ప్రదేశాల్లో పడేసినట్లు గుర్తించామని కమిషనర్ చంద్రగుప్తా వివరించిన విషయం తెలిసిందే.

### వారంతా ఏమయ్యారు..?

కాగా, పార్టీలో స్వాధీనం చేసుకున్న ఓ కారుపై ఏపీకి చెందిన ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తెలుగు సినీపరిశ్రమలో సహాయ నటి హేమ పేరు బయటకు రాగా.. తాను లేనని ఆమె వివరణ ఇచ్చారు. నటుడు శ్రీకాంత్ కూడా వివరణ ఇచ్చుకున్నారు. కానీ, ఈ పార్టీలో టాలీవుడ్కు చెందిన చాలా మంది ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. వారిని పోలీసులు దాచిపెడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డ్రగ్స్ పార్టీ అంటే సినీ ఇండస్ట్రీ ప్రముఖులు ఉండటం ఇటీవల సాధారణమైంది. ఇప్పుడు బెంగళూరులో వారు చిక్కినా.. పోలీసులు దాచి పెడుతున్నట్లుగా టాక్. ఓ ప్రముఖ దర్శకుడి కుమారుడు కూడాఉన్నట్లు తెలుస్తున్నది.

## త్వరలో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో
# మూవీ నిర్మిస్తున్నా...



**- నిర్మాత ఎస్ కే బషీద్**

అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో గెలవబోతున్నానని తెలిపారు నిర్మాత ఎస్ కే బషీద్. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా అల్లరే అల్లరి సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టారు ఎస్ కే బషీద్. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి తాను వచ్చానని, అయితే అడుగడుగున ఇబ్బందులకు గురిచేశారని ఎస్ కే బషీద్ చెప్పారు. రాజకీయంగా తను ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు, తన కొత్త సినిమా విశేషాలను ఈ రోజు హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు నిర్మాత ఎస్ కే బషీద్.

నిర్మాత ఎస్ కే బషీద్ మాట్లాడుతూలి - నేను అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. గతంలో దర్శకుడు సురేష్ కృష్ణకు అడ్వాన్స్ ఇచ్చాను. ఆయన దర్శకత్వంలో విజయేంద్రప్రసాద్ గారి కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. నా రాజకీయ ప్రయాణం గురించి చెప్పాలంటే వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఏపీ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నాను. పార్టీ నన్ను గుర్తించి రాజంపేట పార్లమెంట్ సభ్యుడిగా టికెట్ ఇచ్చింది. నేను ప్రచారం చేసుకునేందుకు రాజంపేట వెళ్తే బీజేపీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర రాజకీయ నాయకులు నన్ను చాలా ఇబ్బందులు గురి చేశారు అన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.